# "దంపతీ తాంబూలాలు"

—— శ్రీమతి పి. ఎస్. ప్రకాశమ్మ ——

(జానకమ్మగారి యిల్లు - జానకమ్మ, సోమమ్మ ప్రవేశిస్తారు.)

జానకమ్మ:- ఏమండీ, సోమమ్మగారూ మిమ్మల్ని ఎన్నిమాట్లో అడుగుదాం అనుకునేదాన్ని కాని తీరా నాలిక చిగురికొచ్చేటప్పటికి మనకెందుకనిపించి, ఊరుకునేదాన్ని.

సోమమ్మ:- జానకమ్మగారూ, ఎందుకూ అంత సందేహం? అదేమిటో అడిగెయ్యండి.

జాన:- అబ్బే, మరేంలేదు. మీ దంపతులిద్దరూ రోజూ ఎక్కడికో వెడుతూంటారు. ఎందుకుచెప్మా? అనుకుంటున్నా.

సో:- మీయిల్లు బంగారంగాను. ఇదా ఆఖరుకి మీ ధర్మసందేహం? ఈ మాత్రం అడిగి తెలుసుకోడానికేనా ఇంత తికమకలు! చెబుతావినండి—నేనూ మా వారూ రోజూ తాసిల్దారుగారింటి కెడుతున్నాం. తాసిల్దారుగారి పెళ్లాం దంపతీ తాంబూలాల నోముపట్టింది. మావారేమో ఆవిడతో 'అమ్మోయ్, సిరి, సంపదాఉన్న సమర్థురాలవు గనక నువ్వీనోము తప్పకుండాపట్టు. దీనివల్ల మీకు దాంపత్యసుఖం, ఐశ్వర్యం యింకా అభివృద్ధవుతాయ్.' అని చెప్పేరట. ఆవిడకి శాస్తుల్లుగారెంత చెబుతే అంత. ఆయనమాట శిరసావహించి, రంగనాయకమ్మగారు ఆనోముపట్టింది. అందుకోసమని రోజూ మేమిద్దరం వాళ్లింటి కెళ్లవలసొచ్చింది.

జాన:- అలాగనా? సరేకాని, ఎన్నాళ్లేమిటీనోము? మీరిద్దరూ పార్వతీ పరమేశ్వర్లుకుమల్లే కలిసి వెడుతోంటే చాలాకాలంనుంచి చూస్తున్నా.

సో:- ఆ! ఒక్క యేడాదినుంచి వెడుతున్నాం. ఇంక పూర్తైపోయింది లెండి. ఎల్లుండితో సరి. ఆవేళ ఉద్యాపన చేసేసుకుంటుంది.

జాన:- అబ్బా! ఏడాది పొడుగునా నోమే! ఏంచెయ్యాలండీ, రోజూనూ?

సో:- రోజూ పదిహేను తమలపాకులు ఐదు చెక్కలూ పెట్టి ఓ దంపతులకి తాంబూలం ఇవ్వాలి, అంతే.

జాన:- మూడువందల అరవై రోజులూ ఓ దంపతులకే తాంబూలం యివ్వాలి కామోసు. వాళ్ల కోనాడు ఏదైనా యిబ్బందొచ్చి వెళ్లకపోతే చిక్కుకాదూ?

సో:- అబ్బే, ఏడాదీ ఓ దంపతులకే యివ్వాలనిలేదు. ఎవళ్లు సందర్భపడితే వాళ్లకే యివ్వొచ్చు. మేమేదో ఆశ్రయించుకున్నాం గనక రోజూ మమ్మల్నే రమ్మంటోంది.

జాన:- బాగానేఉంది కాని, తగినంత దక్షిణయిస్తే తప్ప రోజూ ఎండవేళ అరమైలు వెళ్లడం, అరమైలు రావడం అన్నా కష్టమే. ఏమంటారు?

సో:- కష్టమే అనుకోండి. కాని రోజూ దక్షిణ యిస్తారా, జానకమ్మగారూ? ఏటికేడాదీ మేంపడ్డ కష్టానికి సరిపోయేటట్లు, రంగనాయకమ్మగారు ఎల్లుండి ఉద్యాపన చేసుకున్నప్పుడే ముట్టచెబుతుంది.

జాన:- ఔన్లెండి. కాని, ఈనోముకి ఉద్యాపనంటే ఏం చెయ్యాలి?

సో:-నోము చేసుకునే యిల్లాలు శుభ్రంగా స్నానంచేసి పట్టుచీరా రవికా తొడిగి, చక్కా పసుపూ కుంకం పెట్టుకుని దంపతులికి పూజ్చెయ్యాలి. ఇదయాక, ఓ పట్టెమంచం, పరుపూ, పాన్దానీ, ఓ కంచు చెంబూ, గ్లాసూ—ఇలాంటి పడకగది సామానంతాచేర్చి ఆ దంపతులకి దానం ఇయ్యాలి. సరదా ఉంటే, అగరొత్తులూ, సెంట్లూ—ఇలాంటివికూడా ఇవ్వొచ్చనుకోండి. కొందరేమో దంపతులకి పట్టుచీరా, పంచలచాపూ కూడా ఇస్తారు. ఎక్కడికి దీనికి? 'విత్తంకొద్దీ వైభవం' అన్నారు. డబ్బుండి, సరదాఉంటే ఎంతైనా చెయ్యొచ్చు.

జాన:-పడగ్గది సామానంతా యివ్వాలీ అంటే చాలానే ఔతుంది ఖర్చు.

సో:-అవకేం? తాసిల్దారుగారి భార్య అప్పుడే దాదాపు అరవై, డెబ్భై రూపాయలు ఖర్చుపెట్టి మంచం పరుపూ, అన్నీ తెప్పించింది. పట్టుచీరే అదీకూడా కొనేటట్లే ఉంది చూస్తే. చిగురికేవో ఇలాంటివి ముట్టచెబుతుందిఅనే కాదూ రోజూ మేము శ్రద్ధగా వెళ్లి వస్తూంట మరి?

జాన:-ఔన్లెండి, కాని తాసిల్దారుగారు రంగనాయకమ్మ నోముకోసమని ఇంతఖర్చు కొప్పుకున్నారంటే ఆయన చాలా మంచివాడన్నమాట.

సో:-ఆ. భార్యసరదాపడుతోందీ అంటే, ఆయన డబ్బుఖర్చుకి ఎంతైనా సరే వెనకతియ్యడు. అంతేకాదు. ఆయనికి ఏ విషయంలో ఐనా ఆవిడ ఎంతచెబుతే అంత. అందుకే 'నోము ఉద్యాపననాటికి, అల్లుణ్ణి రమ్మని ఉత్తరంరాయండి' అని ఆవిడంటే, 'ఈ మాత్రందానికి, చదువుకుంటూన్న కుర్రాణ్ణి శెలవుపెట్టించి, రప్పించడం ఎందుకు?' అని సందేహించక ఆయన కార్డురాసి పారేశాట్ట.

జాన:-ఓహో, అలాగనా? రంగనాయకమ్మ నోము ఉద్యాపన ఏదో చాలా వైభవంగానే జరిపేటట్లుంది చూస్తే.

సో:-ఆ, చూద్దురుగాని. మీరూ, మీరూ చుట్టాలుగా. మిమ్మల్ని పిలవకుండా చెయ్యరేం చేసినా. వెళ్లొస్తా మరి.

జాన:-మంచిది.

## జానకమ్మగారి యిల్లు - రెండవదినం - జానకమ్మ రంగనాయకమ్మా ప్రవేశిస్తారు.

రంగనాయకమ్మ:-ఏమండోయ్, జానకమ్మగారు.

జాన:-ఓహో, రంగనాయకమ్మగారా? రండి, రండి......మీరెందుకొచ్చారో చెప్పనా, రంగనాయకమ్మ గారూ.

రంగ:-ఎలా చెప్పగలరు? మీకేమైనా జోస్యం తెలుసా?

జాన:-ఈమాత్రందానికి జోస్యమెందుకండీ? మీరెందు కొచ్చారో మీ పట్టుచీర చెబుతోంది.

రంగ:-బాగా చెప్పేరండి. ఐనా బొట్టుపెట్టి చెప్పడం లాంఛనంగనక చెప్పేస్తాను. రేపు దంపతీ తాంబూలాల నోము ఉద్యాపన చేసుకుంటున్నాను. మీరు తప్పకుండా రావాలి.

జాన:-అలాగేం. ఐతే మీ అల్లుడొచ్చాడా?

రంగ:-చాలా చిత్రంగా ఉందే? మా అల్లుడొస్తాడని కూడా ఎలా తెలిసింది, మీకు?

జాన :-తెలియడానికేముందిందులో? 'ఎంతో వైభవంతో మీరు నోముకి ఉద్యాపన చేసుకుంటూన్నప్పుడు ముచ్చటకని అల్లుణ్ణి పిలవకపోతారా?' అనుకున్నా అంతే.

రంగ :-కేవలం ముచ్చటకోసమని రమ్మంటామా? అందులో అతగాడికి పరీక్షలుగూడా దగ్గిర పడ్డాయిట.

జాన :-అలాగైతే, మరెందుకు రప్పించినట్లు?

రంగ :-దంపతీ తాంబూలాలంటే మీకు తెలుసునుకాదూ?

జాన :-తెలియకేం? నిన్న సోమమ్మగారు చెప్పింది. ఓదంపతులకి పూజ్జేసి, పడకగది సామానంతా దానమివ్వాలిట కాదూ?

రంగ :-ఔను. అందుకోసమనే, అల్లుణ్ణి రమ్మన్నాను. లేకపోతే రైలు ఖర్చులుపెట్టి ఇంతదూరం రమ్మనడం ఎందుకు?

జాన :-ఏమిటీ అన్నారు!

రంగ :-మీరేదో పరధ్యాన్నంగా ఉన్నట్టున్నారే? రేపు దానం ఇవ్వడంకోసమని అల్లుణ్ణి రమ్మన్నాను.

జాన :-ఊహూ! ఆ పడకగదిసామాను ఉద్యాపనలో మీ కూతురికీ అల్లుడికీ ఇద్దామనా?

రంగ :-ఔను. ఏం? అలా ఆలోచిస్తున్నారు?

జాన :-అబ్బే ఏంలేదండీ. 'దానం అనేది పైవాళ్లకేగాని, ఇంట్లోవాళ్లకివ్వొచ్చా?' అనుకుంటున్నా.

రంగ :-ఔను. మొదట మావారుకూడా అదే అన్నారు. కాని నేచెప్పేదేమిటంటే, కూతురికి పెళ్లి ఎప్పుడైతే చేశామో, ఆనాటినుంచీ అది పరాయిదే. లేకపోతే బోలెడు సొమ్మోసి కొన్న సామానంతా ఎవళ్లకో యిచ్చుకుంటామటండీ?

జాన :-అబ్బే, నేనందుకోసం అనలేదండీ. 'కూతురూ అల్లుడూకూడా మనకంటే చిన్నవాళ్లు కదా, ఆచిన్న దంపతుల్ని కూచోపెట్టి, పెద్దవాళ్లు పూజ్జెయ్యడమనీ, నమస్కారంపెట్టడమనీ, ఇలాంటివి జరపచ్చా?' అనుకుంటున్నా అంతే.

రంగ :-ఆ. దానికేమిటి లెండి! పూజ్జేసేటప్పుడు వాళ్లు ఓ పుణ్యదంపతులనే భావం మనస్సులో పెట్టుకుని పూజ్జేస్తాంకాని, కూతురూ, అల్లుడూ అనుకుని పూజ్జేస్తామా? ఆమాటకొస్తే మనకంటె పెద్దవాళ్లైన దంపతులు పైవాళ్లలోనైనా లభించకపోవచ్చు. అబ్బే వయస్సుకీ దీనికీ సంబంధం లేదండీ.

జాన :-ఔతే రేపు శాస్త్రులుగారూ, సోమమ్మగారు కూడా వస్తారా?

రంగ :-పూజ చేయించడంకోసం శాస్త్రులుగారొస్తారు. బహుశః సోమమ్మగారూ వస్తుంది. ఏమీ, అలా అడిగేరు?

జాన :-మరేంలేదు. ఆ దంపతులుకూడా ఏదో ఆశపెట్టుకున్నట్లు తోస్తోంది.

రంగ :-దేనికోసమని? ఆశ కంతుండదులేండి. పోనీ బీదవాళ్లుగదా అని ప్రతిరోజూ ఏటికేడాదీ తాంబూలం వాళ్ళకే యిచ్చేదాన్ని. వాళ్ళొక్కొక్కప్పుడు ఆలస్యంగా వచ్చినా తాంబూలం మరొకళ్ల కిచ్చెయ్యకుండా వాళ్లకోసం అట్టేపెట్టి ఉంచేదాన్ని. ఇంతకంటే ఏమిచెయ్యం? రేపూజ చేయించినప్పుడు

శాస్త్రుల్లుగారికి దక్షిణక్రింద ఒకటో రెండో ఏలాగా ముట్టచెబుతా......వెళ్ళిరానా మరి? ఇంకా చాలామందిని పిలవాలి.

జాన :- మంచిది.

(జానకమ్మగారి ఇల్లు - మూడవరోజు - జానకమ్మ, సోమమ్మ ప్రవేశిస్తారు.)

సోమ :- అయ్యో జానకమ్మగారూ, చివరికి రంగనాయకమ్మగారు ఏమిచేసిందో చూశారా?

జాన :- ఏమి జరిగిందో చెప్పండి.

సోమ :- అల్లుణ్ణి ముచ్చటకోసం పిలిపించారనుకొన్నాను గాని కూతురుకీ అల్లుడికీ దంపతీ పూచ్చేసి, ఆఖరికి మానోట్లో కరక్కాయ కొటతారనుకోలేదు.

జాన :- ఇలా జరుగుతుందని తెలిస్తే, నా కసహ్యం వేసి నేరావడం మానేశా.

సోమ :- ఏం? నిన్నుపిలవడానికొచ్చినప్పుడు 'ఇలా కూతురి కిచ్చుకుంటాం' అని చెప్పిందాఏమిటి?

జాన :- ఆ. ప్రసంగవశాత్తూ చెప్పింది.

సోమ :- ఏటికేడాదీ రప్పించి ఆఖరికి ఎంత అన్యాయంచేసిందో చూడండి. నేను ఉండబట్టలేక మీతో చెప్పుకుంటున్నాను. భోజనం చేసీచెయ్యడంతో ఎండలో రోజు గుండెలు కముక్కుంటూ వెళ్లేవాళ్లం.

జాన :- ఔనమ్మా. ఒకరోజా, రెండురోజులా? ఏటికేడాది వెళ్లేరు పాపం!

సోమ :- అలా శ్రమ పడినందుకు మాకు ముట్టినవి ఆ తాంబూలాలే. 'ఇట్టే వచ్చినమ్మకి పట్టుచీర, ఆశపెట్టుకున్నమ్మకి గోచిపాత' అన్నట్లు తాంబూలం ఖర్చుతో ఆవిడ నోము ఫలితం అంతా సంపాదించుకోదలచింది. పోనీలెండి. సంపాదించి అనుభవించ నియ్యండి 'వెలసులభం, ఫలం అధికం' అంటే ఇదే కామోసు.

జాన :- సోమమ్మగారూ పోనిద్దురూ. ఇంక ఆవిడ గొడవ తలపెట్టుకుని ఆట్టే ఇదవకండి. 'నోముచేసుకున్నట్లూ అవుతుంది. పిల్లకి ఇప్పుడే సారిపెట్టేసినట్లూ ఐపోతుంద'ని ఆలోచించి ఇలా చేసింది, రంగనాయకమ్మ. ఇలాంటి నోముచేస్తేనేం? చెయ్యకపోతేనేమి? మనలో ఉండే ధర్మబుద్ధి వికసించి, మన శక్తికొద్దీ ఎంతోకొంత, యోగ్యులైన పేదవాళ్లకి ముట్టచెప్పటకోసం నోములంటూ పుట్టేయి కాని, ఈ వంకపెట్టుకుని కూతుళ్లకి సారెలూ, చెల్లెళ్లకి కానుకలూ ఇచ్చుకోవడంకోసం పుట్టేయా? ఇలాంటినోములుచేసి ఫలితం సంపాదించుకోవాలంటే, ఇచ్చేసెయ్యడానికి భగవంతుడంత వెఱ్ఱివాడా?

సో :- ఫలితంమాట ఎలాఉన్నా నోముచేసుకున్నామన్న గొప్పవచ్చింది చూడండి.

జాన :- గొప్పా. ఎందుకూ ఈగొప్ప? ఎవరుచూసి సంతోషిస్తారని? సోమమ్మగారూ, ఒక్కమాట చెపుతా వినండి. ఈ విధంగా నోములుచేసి 'నేనూచేశాను నోము' అని చెప్పుకోడమనేది, భగవంతుణ్ణీ, ప్రజల్నీ అనవసరంగా మోసంచెయ్యడంకోసం ప్రయత్నించడమన్న మాట. దీనివల్ల, వీళ్లని మెచ్చుకునేవాళ్లు లేకపోవడమేకాకుండా, నలుగురూ వీళ్ల తెలివితక్కువా లోభత్వం చూసి నవ్వుతారు.

సో :- మీ తల్లికడుపు చల్లగా, ఉన్నమాట చెప్పేరండీ మీరు.